నాకు నచ్చిన నా కథ

కె. వి. యస్. వర్మ

నేను రాసిన చిన్నా, పెద్దా వంద కథలో నుంచి నాకు నచ్చిన కథను ఎంపికచేయడానికి నేనేమాత్రమూ ఇబ్బంది పడలేదు. ఈ కథ అంటే నాకెంతో ఇష్టం. బహుశా ఇది 'నాకథ' కావడం వల్లేమో, ఒక రకంగా 'యుద్ధం' కథలోని ప్రకాశరావు నేనే. అందుకేనేమో ప్రకాశరావంటే నాకు ప్రాణం. ప్రకాశరావువంటి పిల్లలన్నా నాకు చాలా మోజు. మూఢ విశ్వాసాలు, కాలం చెల్లిన సంప్రదాయాలకు సంబంధించిన స్పృహ నాకు నా పదహారో ఏట కలిగితే, ప్రకాశరావుకు ఆ చైతన్యం తన పదకొండో ఏటే కలిగటమే కాకుండా, కార్యోన్ముఖుడు కూడా అయ్యాడు. అంటే అతను నాకంటే అయిదేళ్ళ ముందున్నాడు. అలాగ ప్రకాశరావు నాకు హీరో అయ్యాడు.

ఓ సంవత్సరం క్రితం రాయగడలో జరిగిన ఓ సాహితీ సమావేశంలో నేను 'యుద్ధం' కథను చదివినప్పుడు ముఖ్య అతిథిగారు శివమెత్తిపోయారు. నా కథ ధ్యేయం నెరవేరుతోందని నాకప్పుడు అనిపించింది. కథకు ప్రయోజనం వుండాలని నమ్మేవాళ్ళలో నేనొకణ్ణి. అలాంటివారికి నాకు నచ్చిన 'నా కథ' తప్పక నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈ కథ యువజన సంచికలో ప్రచురితమైంది.

యుద్ధం

ప్రకాశరావుకు నోరు తిరగడంలేదు. ఉదయం వేద పాఠాలలోనూ అంతే మళ్లీ ప్రయత్నించాడు. విసుగొచ్చింది. గోడమీది కేలండర్‌వంక చూశాడు. అందులోని బాబు ఎంత అందంగా వున్నాడు. అతని క్రాపు ఎంత చక్కగా వుంది!

అద్దంలో ముఖం చూసుకుందామని గబుక్కున లేచాడు. బిగించిన అంగోస్త్రం గోచీ వూడిపోయింది ఊడిపోయిన గోచీని చేత్తో చిరాగ్గా పైకిలాగి, రెండోచేత్తో గట్టిగా బిగించాడు. తర్వాత, గూటిదగ్గర కెళ్లాడు. అద్దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు ప్రకాశరావు.

కేలండరులోని బొమ్మ ముఖంలాగానే తన ముఖమూ అందంగా కన్పించింది. అయితే మాత్రం, అంత అందమైన క్రాపు తన కేదీ! తల మీద గుండు సూదులు సగానికి దిక్కొట్టినట్టుగా వున్నాయి వెంట్రుకలు. ప్రకాశరావు ముఖాన్ని అసహ్యంగా పెట్టాడు, 'ఛీ' బాగోలేదనుకుంటూ, అప్పుడే గుర్తుకు వచ్చినట్టుగా ఒక చేత్తో అద్దం పట్టుకుని, రెండో చేయి తలమీదుగా వెనక్కు దొర్లించాడు. పిలక చేతికి తగలగానే పామును పట్టుకున్నట్టుగా ఒళ్లు జలదరించింది. ఇంకొంచెం కిందకు పోనిచ్చాడు చేతిని. పాంపడగలా ముడి. వెంటనే చెయ్యి తీసేశా అద్దాన్ని గూటిలో పెట్టబోతుండగా, ప్రకాశరావు తండ్రి కోపంగా చూస్తూ గుమ్మందగ్గర నిలబడ్డాడు.

"ఏరా ప్రకాశం. వెధవ షోకులేనా! చదువేమైనా వుందా" అన్నాడు సత్యనారాయణరావు.

పదకొండేళ్ల ప్రకాశం మాట్లాడకుండా నేలను చూస్తూ నిలుచుండిపోయాడు.

"ఈవేళ్టి పాఠం వచ్చిందా" అంటూ నేలమీద పడివున్న పుస్తకాన్ని తీశాడు సత్యనారాయణరావు.

ప్రకాశం మూగవాడిలా చూస్తుండిపోయాడు.

"ఈ శ్లోకం అప్పజెప్పు"

"అవి చదువుదామంటే నోరు తిరగడంలేదు నాన్నా."

"జట్టీపట్టగా పట్టగా అదే తిరుగుతుందిరా వెధవా. నువ్వేమన్నా నీచు తినే శూద్రుడి వేమిటిరా నోరు తిరగకపోవడానికి."

"నేనూ పక్కింటి కాంతిలా స్కూలు కెళ్తా."

"ఏడ్చావులే స్కూలు కెళ్తాడట స్కూలుకు. ఆ స్కూలు చదువు కూడు పెట్టదురా, నాలుగు మంత్రంముక్కలు నేర్చుకుంటే నాలుగురాళ్లు సంపాదించు కోవచ్చు నాలా. బుద్ధిగా వేదపాఠశాల కెళ్లి చదవకపోయావో నీ ఒళ్లు హూనం చేసేస్తాను గ్రత్త" అని రంకెవేశాడు సత్యనారాయణరావు.

ప్రకాశానికి కన్నీళ్లొచ్చాయి. పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. సత్య నారాయణరావు ముక్కుపొడుం డబ్బా మొలలోంచి తీసి, బయటకు నడిచాడు.

ప్రకాశం అవేళ్టి పాఠం చదవబోయాడు. నోరు తిరగలేదు. వంట గదిలోకి చూశాడు. తల్లి వంట చేస్తోంది. ఆమె కట్టిన చీరనుంచి నీళ్లు కారు తున్నాయి. వంటిల్లు బురద బురదగా వుంది. ఒంటిని అంటిపెట్టుకుని చీర బరబరలాడుతోంది. ఆ తడిచీర విప్పేసి పొడిచీర కట్టుకోగూడదూ అనుకున్నాడు ప్రకాశం చాలాసార్లగానే.

వంటింట్లోకి నడిచాడు ప్రకాశం, తల్లివంక చూశాడు. ఆమె కూర తాలింపు పెడుతూ, వచ్చిన గొట్టుకు దగ్గుతూ ముక్కు తుడుచుకుంది చీర కొంగుతో.

"అమ్మా. పొడిచీర కట్టుకోకూడదూ!"

"తప్పురా ప్రకాశం. శూద్రుల్లాగ మడీతడీ లేకుండా వంటచెయ్యకూడదు. నీ కివన్నీ ఎందుకురా శుభ్రంగా చదువుకోక."

"నీ లాగానా" అన్నాడు ప్రకాశం నెమ్మదిగా.

ఆమెకు వినిపించలేదు. ప్రకాశం వీధిలోకి నడిచాడు. పిల్లలు ఆడుకుంటూ వుండటం చూశాడు. అతని ముఖం వికసించింది. పరుగెత్తుకుంటూ వాళ్ల దగ్గర కెళ్లాడు. 'కబాడీ' తనూ ఆడతానన్నాడు. ఒక జట్టులో కలిశాడు. ఆట జోరుగా సాగుతోంది. ప్రకాశం కూత కూస్తూ వెళ్లాడు. గుక్కడి పోతుండగా పరుగెడుతూ వెనక్కు తిరిగాడు. అప్పుడో కుర్రాడు వేగంగా ప్రకాశం గోచీపట్టుకున్నాడు. ప్రకాశం బరిమీద చెయ్యిపెట్టడానికి వంగేడు. ఇంతలో మరో కుర్రాడు ప్రకాశం పిలక పట్టుకున్నాడు. ఇంకో కుర్రాడు జంధ్యం పట్టుకుని లాగేడు. ప్రకాశం ఐపోయాడు. జంధ్యం తెగిపోయింది.

"నీ కాట రాదంటూ" ప్రకాశాన్ని ఆటలోంచి తీసేశారు మిగతా పిల్లలు. ఏడుపుమొహంతో ఇంటికి వచ్చాడు. పళ్ళు కొరుకుతూ కోపంగా కూర్చున్నాడు. చిరాగ్గా పుస్తకం తీశాడు చదువుదామని. దృష్టి పాఠంమీదకు పోలేదు. పుస్తకంలోని కాగితాన్ని విసుగ్గా లాగాడు. కాగితం చిరిగిపోయింది. సర్రుమని చప్పుడు. ఇంకో కాగితం చింపేడు. ఇంకోటి....ఇంకోటి కాగితాలను చింపుతుంటే బాలా సరదావేసింది ప్రకాశానికి.

"ఏం చేస్తున్నావురా ప్రకాశం. మడికట్టుకుని రా, అన్నం వడ్డిస్తున్నాను" అని కేకేసింది తల్లి.

ప్రకాశం కాగితాలను వీధిలోకి గిరాటేసి, వంటింట్లోకి నడిచాడు.

* * *

తెల్లవారింది. ఇంకా చీకటి పూర్తిగా చిరిగిపోలేదు. ప్రకాశం బద్ధకంగా మంచంమీద దొర్లుతున్నాడు. సత్యనారాయణరావు స్నానంచేసి ప్రకాశాన్ని లేపాడు. ప్రకాశం లేచి మంచంమీద కూర్చున్నాడు, కళ్ళు నులుముకుంటూ. తల్లి పొయ్యి వెలిగిస్తూ కనిపించింది.

"ప్రకాశం! త్వరగా స్నానంచేసి తయారవ్వు."

"కొంచెంసేపుండి చేస్తాను నాన్నా."

"రాజన్‌రాజుగారింట్లో తద్దినంరా ఇవేళ. నువ్వూరా నాతో."

"నువ్వెళ్ళు! నేను రాను."

"ఏద్చేవులే. కబుర్లు మాని త్వరగా తెములు." అన్నాడు సత్యనారాయణరావు కసురుతూ.

ప్రకాశం అయిష్టంగా లేచాడు. ముఖంకడుక్కున్నాడు ప్రకాశం స్నానం చేస్తుంటే సత్యనారాయణరావు దృష్టి కొడుకు శరీరంమీద పడింది. జంధ్యం లేకపోవడం చూశాడు. మంత్రాలు చదివి కొడుక్కి జంధ్యం వేశాడు. ప్రకాశం తండ్రిని కోపంగా చూశాడు. కొడుకు కోపంగా చూసినట్టు తండ్రికి తెలీదు.

తర్వాత, తల్లి యిచ్చిన కాఫీ తాగి తండ్రివెంట నడిచాడు ప్రకాశం.

"నాన్నా ఈ వేళ వేదపాఠాలకు వెళ్ళడం మానెయ్యనా?"

"మానెయ్యడం ఎందుకు, తద్దినం పెట్టడం అయిపోగానే వెళ్దువుగాని" అన్నాడు సత్యనారాయణ.

ప్రకాశం నీరసంగా నడుస్తున్నాడు. బోర్డు స్కూలులో చదువుతున్న రోజులు గుర్తొచ్చాయి. అప్పుడు పక్కింటి కాంతి, తనూ ఎంత సరదాగా

ఆడుకునేవాళ్లు. ఇప్పుడు కాంతి హైస్కూలులో చేరి చదువుకుంటున్నాడు. ఈ మధ్య తనకు కాంతితో ఆడుకోవడమే కుదరడంలేదు. తను కూడా హైస్కూలులో చదువుకుంటే ఎంత బావుండునో. నాన్నేమో 'గోవిందస్వాహా' ముక్కట్టుకో, ముక్కులో వేలెట్టుకో చదువుకో మంటాడు. 'ఛీ' అంతా తుప్పుకంపు. హైస్కూల్లో అయితే ఎన్ని రకాలు పుస్తకాలు చదువుకో వచ్చునో.

రాజన్‌రాజుగారిల్లు వచ్చింది. ఇద్దరూ లోపలికెళ్లారు. సత్యనారాయణరావు రాజన్‌రాజుగారికి పురోహితుడు. అతను నిన్ననే మరో ఇద్దరు బ్రాహ్మలకు చెప్పడంతో వాళ్లూ వచ్చారు. ఓ గంటన్నరకు తతంగం పూర్తయింది. ప్రకాశం ముళ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. తండ్రితోపాటు అతనికీ తాంబూలం ఇచ్చారు. తమలపాకులు విప్పి చూసాడు. పది పైసల బిళ్ల కనిపించింది. తాంబూలం పుచ్చుకునేటప్పుడు ప్రకాశానికి తమ ఇంటిముందు అడుక్కునే ముసలమ్మ గుర్తొచ్చింది. అతనికి అదోలా అనిపించింది. అసహ్యమేసింది.

ఆ తర్వాత తండ్రీ, కొడుకు వీధిలోకి వచ్చారు. తండ్రి చూడకుండా ప్రకాశం పదిపైసలబిళ్ల యిసకలోకి విసిరేశాడు. చేతులు దులుపుకున్నాడు. ఏదో బరువు దించినట్టు తేలిగ్గా ఫీలయ్యాడు. సత్యనారాయణరావు కొడుకును వేదపాఠశాల కెళ్లమని చెప్పి, డబ్బులిలా ఇవ్వమన్నాడు. నిజం చెబితే తండ్రి కొడతాడేమోనని, డబ్బులు పడిపోయాయని చెప్పాడు. నసుగుతూ. సత్యనారాయణరావు చెడామడా తిట్టాడు. ప్రకాశం మౌనంగా తండ్రి చూస్తుండగా వేద పాఠశాలకేసి నడిచాడు.

ఆరోజు ప్రకాశం వేదపాఠశాల కెళ్లలేదు. సాయంత్రం వరకు దగ్గర్లో వున్న చెరువుగట్టుమీద కాలక్షేపం చేశాడు, రకరకాలా బుల్లిబుల్లి ఆలోచనలతో.

* * *

ప్రకాశం వేదపాఠశాల కెళ్లి రెండు రోజులయింది. చెరువుగట్టు దగ్గరా, కాలవగట్టు దగ్గరా పశువుల్ని మేపేకుర్రాళ్లతో సాయంత్రంవరకు ఆడుకుని ఇంటికి వచ్చేవాడు. తల్లితండ్రీ ప్రకాశం వేదపాఠశాలకు వెళ్లివస్తున్నాడనే అనుకున్నారు.

మూడవ రోజు ఉదయం సత్యనారాయణరావు కొడుకును తన కూడా రమ్మన్నాడు. ప్రకాశం చిరాగ్గా తండ్రివెంట నడిచాడు. దారిలో తండ్రి రోడ్డు నక్కన వాకిట్లోకి వెళ్లడానికి జంధ్యం మోచేతిమీదకు తీసుకున్నాడు. ప్రకాశం తండ్రి వచ్చేదాక ఆగి,

"నాన్నా ఉచ్చ జంధ్యం మీద పడుతుందనా మోచేతి మీదకు తీసుకున్నావ్" అని ఎప్పటినుంచో సీకుతున్న అనుమానాన్ని అడిగాడు.

సత్యనారాయణరావుకు ప్రకాశంమీద కోపంవచ్చింది. అతనికి కొడుకు వరస నచ్చలేదు. వచ్చిన కోపాన్ని అపుకుని,

"అలా తీసుకోవాలని మన సంప్రదాయం చెబుతోందిరా, చొప్పదంటు ప్రశ్నలు మాని నడు. అవునూ, నువ్వు జంధ్యం వాకిటికెళ్లేటప్పుడు నాలా తీసుకోవడం లేదా" అని అడిగాడు సత్యనారాయణరావు.

'చచ్చానురా' అనుకున్నాడు ప్రకాశం. మాటాడకుండా తండ్రిని అనుసరించాడు. దారిలో మరో ముగ్గురు బ్రాహ్మలు కలిశారు. ఓ పావుగంట నడిచి, "షర్మిలా" క్లాత్ సెంటర్ దగ్గర ఆగారు. ఇవేళ షర్మిలా క్లాత్ సెంటర్ ఓపెనింగు. పూజ చెయ్యడానికి ఇంకో పది నిమిషాల టైముంది. బ్రాహ్మలంతా ప్లాట్‌ఫారంమీద కూచున్నారు.

సత్యనారాయణరావు షర్మిలా క్లాత్ సెంటర్ ప్రొప్రయిటర్ వద్ద కెళ్లాడు. అతనూ మిగతా బ్రాహ్మలతో ప్లాట్‌ఫారం మీద కూర్చునేవాడే. అయితే, షర్మిలా క్లాత్ సెంటర్ యజమాని పురోహితుడు ఊరికెళ్లడంతో సత్యనారాయణరావుకు పూజచేయించే 'ఛాన్స్' వచ్చింది. డబ్బులు బాగా గిట్టుబాటవుతాయని అతనికి చాలా సంతోషంగా వుంది. ఇవేళ తనే 'హెడ్ పురోహితుణ్ని' కదా అని మరెంతో గర్వంగానూ వుంది.

ప్లాట్‌ఫారం మీద కూర్చున్న పురోహితులు తాము యెప్పుడు ఏ పెళ్లి ఎలా జరిపించారో, ఎప్పుడు ఏ సంవత్సరికం ఎలా చేయించారో, ఎంత ముట్టిందో లాంటి విషయాలు మాట్లాడుకుంటున్నారు. గొప్పలు చెప్పుకుంటున్నారు.

ప్రకాశం మెయిన్‌రోడ్డు మీద హడావిడిగా తిరుగుతున్న కార్లనూ రిక్షాలనూ, జనాన్నీ చూస్తూ కూచున్నాడు. తన ఈడు పిల్లలే శుభ్రమైన నిక్కర్లూ చొక్కాలూ, బెల్‌బాటమ్ పాంట్లూ వేసుకుని ఉత్సాహంగా పుస్తకాలు పట్టుకుని వెళ్తుండడం చూశాడు. అతని మెదడులో మళ్లీ ఆలోచనల పుష్పాలు వికసించాయి.

నేను కూడా హైస్కూలులో చదవాల్సిందే. నాన్నకు ఎంత చెప్పినా లాభం లేదు, అమ్మకే చెప్పాలి. అమ్మ చాలా మంచిది. కానీ, నాన్నమాట వినాలంటుంది. పేచీ పెట్టెయ్యాలి. ఏడ్చెయ్యాలి. అప్పుడు అమ్మ కొంచెం కరుగుతుంది బుజ్జగించి అమ్మ అన్నం పెడుతుంది. తను అన్నం తినడు. "వూరు

కున్నాడు కదా" అని తర్వాత అమ్మ, నాన్న మాట వినాలంటుంది. అప్పే అలా చెయ్యకూడదు. అమ్మ 'రా నాన్నా' అంటూ అన్నం పెట్టినప్పుడు తను తినకూడదు. పొద్దుటా తినకూడదు. రాత్రీ తినకూడదు. అమ్మో, ఆకలెయ్యదూ మరి? ఆకలేసినా. సరే, ఎన్ని రోజులైనా సరే. హైస్కూల్లో చేర్పించిందాకా తనలాగే చెయ్యాలి. దెబ్బతో అమ్మ హడలిపోతుంది. పాపం, అమ్మ మంచిది. నాన్నతో గట్టిగా చెబుతుంది. ఎలాగైనా ఒప్పిస్తుంది. ప్రకాశం ముఖంలో చిరునవ్వు మెరిసింది.

ప్రకాశం హుషారుగా రోడ్డుమీదకు చూశాడు. అప్పుడే షర్మిలా క్లాత్ సెంటర్ ముందు ఓ వ్యక్తి రిక్షాలోంచి దిగాడు. రిక్షావాడికి డబ్బులిచ్చాడు. "ఇంకో పది పైసలు వస్తాయండి" అన్నాడు రిక్షావాలా. "నంభై పైసల కంటేనా" అన్నాడతను. "బస్‌స్టాండ్ నుంచి అర్ధరూపాయికంటే ఎవరూ రారండి" అన్నాడు రిక్షావాలా గట్టిగా, విరాగ్గా. అతను అటూ ఇటూ చూసి పది పైసలు యిచ్చేశాడు. రిక్షావాలా వెళ్ళిపోయాడు.

రిక్షాలోంచి దిగిన వ్యక్తిని చూడగానే సత్యనారాయణరావు గుండెలో రాయిపడింది. "రండి పంతులుగారూ రండి. మీ రింకా రారనుకున్నాను. సరిగ్గా టైముకొచ్చారు. ఇంకే ఏలోటూ రాకుండా పూజ చేయించేస్తారు. ఇది మాకు శుభసూచకం" అన్నాడు షర్మిలా క్లాత్ సెంటర్ ప్రొప్రయిటర్.

సత్యనారాయణరావు నిరాశగా నీరసంగా ప్లాట్‌ఫారం మీదకు వచ్చి కూర్చున్నాడు. ప్రకాశం తెల్లబోతూ ఇదంతా చూస్తూనే వున్నాడు. ఇందాకటి రిక్షావాలా జ్ఞాపకానికొచ్చాడు. వాడికి జంధ్యం లేదు. బెల్‌బాటమ్ పేంటు వేసుకుని వస్తున్నవాడికి జంధ్యం వుంటుందా? ఆ మాటే తండ్రి నడిగాడు.

"రిక్షావాడికి జంధ్యం వుండదురా. వాడు కులం తక్కువవాడు. దయ్యంలా జుట్టు పెంచుకున్నవాడికి జంధ్యం వుందో లేదో ఎలా తెలుస్తుంది. పెద్ద కులం వాడయితే వుంటుంది. లేకపోతే లేదు" అన్నాడు విసుగ్గా సత్యనారాయణరావు.

ప్రకాశం షర్మిలా క్లాత్ సెంటర్‌కు వస్తున్నవాళ్లను చూస్తూ కూర్చున్నాడు. అంతలో పెద్ద గొంతుతో పద్యాలు పాడుతూ, షాపు యజమానిని ఇంద్రుడూ, చంద్రుడూ అని పొగుడుతూ భట్రాజు వచ్చాడు. ప్రకాశం భట్రాజు వంక చూశాడు. ముగ్గుబుట్టలా వున్న తల, మాసిన గడ్డం, పంచెకట్టూ, భుజం మీదుగా జంధ్యం. అచ్చూ నాన్నలాగే వున్నాడనుకున్నాడు. షాపు యజమాని భట్రాజుకు పావలా యిచ్చాడు. భట్రాజు "విజయీభవ, దిగ్విజయీభవ" అని దీవించి వెళ్లిపోయాడు.

"నాన్నా, తెలిసిపోయింది. నాకు తెలిసిపోయింది" అంటూ సంతోషంగా గెంతాడు ప్రకాశం.

"ఏవిటి తెల్సిందిరా నా బొంద" అయోమయంగా కొడుకును చూస్తూ అడిగాడు సత్యనారాయణరావు.

"జంధ్యాలు అడుక్కునేవాళ్ళకే వుంటాయన్న మాట" అన్నాడు చప్పట్లు కొడుతూ ప్రకాశం.

సత్యనారాయణరావుకు ఒళ్ళు మండిపోయింది. మిగతా బ్రాహ్మలంతా ఇటు చూడడంతో ఒంటికి కారం రాసుకున్నట్టనిపించింది.

"దౌర్భాగ్యుడా, నోటికేదొస్తే అది అనెయ్యడమే. పిల్లిని చంకలో పెట్టుకొచ్చినట్టు నిన్ను బుద్ధిలేక తీసుకొచ్చానురా నా కర్మ" అంటూ సత్యనారాయణరావు కొడుకు వీపుమీద రెండు దెబ్బలేశాడు.

ప్రకాశానికి కోపమొచ్చింది. వచ్చే ఏడుపును ఆపుకున్నాడు. పూజ పూర్తవడంతో బ్రాహ్మలంతా షాపులోకి వెళ్లారు. షాపు యజమాని తన యింటి పురోహితుడికి తాంబూలంలో పదిహేను రూపాయలు పెట్టి నమస్కారం చేశాడు రెండు చేతులూ జోడించి. తర్వాత, ఒక్కొక్క బ్రాహ్మడికీ తాంబూలంతో ఒకో అర్ధరూపాయి పెట్టి ఇచ్చాడు. సత్యనారాయణరావుకు రెండ్రూపాయలిచ్చాడు. అతనింకా కావాలని అడగబోయాడు. షాపు యజమాని అతని వంక చూడకుండానే వెళ్ళిపోయాడు. ఇదంతా చూస్తున్న ప్రకాశానికి తండ్రిమీద జాలి కలిగింది. అప్పుడతనికి ఇందాకటి రిక్షావాడు మళ్ళీ గుర్తుకొచ్చాడు. నాన్న రిక్షావాలా అంత ఖచ్చితంగా డబ్బులెందుకు అడగలేకపోయాడు! వాళ్లెంతిస్తే అంతే నోరు మూసుకుని తీసుకోవలసిందే బిచ్చగాళ్ళలా.... ప్రకాశం బుర్రనిండా ఆలోచన్లు.

బ్రాహ్మలంతా ప్లాట్‌ఫారంమీద కూర్చుని షాపు యజమాని ఇచ్చిన టిఫిను పొట్లాలు విప్పుకుంటున్నారు. ప్రకాశం నెమ్మదిగా తండ్రి వెనక్కి వెళ్ళి కూర్చున్నాడు. అతనికంతా అసహ్యంగా వుంది. కోపంగా వుంది. చిరాగ్గా వుంది. తన ఒంటిమీది జంధ్యం తీసిపారేశాడు. అప్పుడే స్నానం చేసినట్టనిపించింది. ప్లాట్‌ఫారం మీద తారుపోయి పైకివచ్చిన నల్ల కంకరరాళ్ళను చూశాడు. రెండు రాళ్ళను చేతిలోకి తీసుకున్నాడు. నెమ్మదిగా ఒక రాయిమీద వేలాడుతున్న తండ్రి జంధ్యం పెట్టి దానిమీద మరో రాయి వుంచాడు. సత్యనారాయణరావు

పెనుమళ్లలో తను జరిపించిన వివాహం గురించి ఇప్పటి అసంతృప్తి నుంచి తప్పించుకోడానికి గొప్పగా చెప్పుతున్నాడు మిగతావాళ్ళకు.

ప్రకాశం చప్పుడుకాకుండా నెమ్మదిగా రెండు రాళ్ళనూ రాపిడి చేయడం మొదలెట్టాడు. కొన్ని నిమిషాలకు జంధ్యం తెగిపోయింది.

ఒక్క ఉదుటున ప్రకాశం ఆనందంగా లేచాడు. జంధ్యం కొసపట్టుకొని లాగాడు. జంధ్యం చేతిలో కొచ్చేసింది. సత్యనారాయణరావు ఉలిక్కిపడ్డాడు. ఒంటిమీద జంధ్యం లేదు. ప్రకాశం పగలబడి నవ్వుతున్నాడు. బుగ్గలు పొంగి పోతున్నాయి. కళ్లు మూసుకుపోతున్నాయి. నవ్వు ఆపుకోలేక పోతున్నాడు. నవ్వుతూ నవ్వుతూ తండ్రికి దూరంగా జరుగుతున్నాడు. తృప్తిగా నవ్విన నవ్వు కావడంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. జంధ్యాన్ని వుండగా చుట్టి సైడు కాలవలోకి విసిరేశాడు.

సత్యనారాయణరావు అలవిమీరిన ఆగ్రహంలో ఊగిపోయాడు. కొన్ని క్షణాల దాకా నోటమాట రాలేదు. ప్రకాశాన్ని కొడదామని రెండు అడుగులేశాడు. ప్రకాశం తండ్రికి అందకుండా పరుగెత్తాడు. నవ్వుతూనే ఇంటివైపుగా పరుగెత్తాడు. అతని మనసునిండా ఆనందం నిండిపోయింది. ఉత్సాహం ఉరకలు వేసింది. ప్రకాశం పరుగెడుతూ ఒక్క క్షణం ఆగాడు. చేత్తో పిలక లాక్కున్నాడు. నొప్పి చేసింది. పిలక ముడి వూడిపోయింది. ఒక్కసారి తల పరికించి మళ్లీ పరుగుతీశాడు. పిలక కిందకూ మీదకూ ఊగుతుంది. కొంతసేపట్లో ప్రకాశం చేతిలోకి వచ్చే బ్లేడును తలచుకొని భయంతో వణికిపోతోంది.